క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శనివారం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు ప్రారంభించారు. రెయిన్‌బోవిస్టాస్ వద్ద సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంజనేయనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలన్నారు. మధుసూదన్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, అనిల్, హనుమంత్‌రావు, కృష్ణంరాజు, ప్రకృతి రఘు, నవాజ్, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా ప్రారంభం



ఈద్గాను ప్రారంభించి మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలోని ఈద్గాను హోంమంత్రి మహమూద్ అలీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రభుత్వం అన్ని పండుగలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ముస్లింలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అండగా ఉంటూ ఈద్గాను నిర్మించి ఇవ్వటం అభినందనీయమని కొనియాడారు. ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ నగరంలో ఎక్కడా లేని విధంగా ముస్లింలకు కేపీహెచ్‌బీలో ఈద్గా నిర్మించామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అన్నికులాలు, మతాలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా రంజాన్



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు



అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగంకు శుభాకాంక్షలు తెలుపుతున్న బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు



ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్

కూకట్‌పల్లి (జోన్‌బృందం): రంజాన్ పర్వదినాన్ని కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. పలు మసీదుల వద్ద బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ త్యాగం, దయ, క్రమశిక్షణ, దానగుణాలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు నాయకులను మసీదు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు మొయిజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గొట్టిముక్కల వెంగళరావు



మూసాపేటలో..



ఖాజానగర్ దర్గాలో..



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ సభ్యుడు డా. సత్యం శ్రీరంగం

అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో నైట్ క్యాంప్





కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని అక్షర ఇంటర్నేషనల్ బ్రాంచ్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ హైమావతి ఆధ్వర్యంలో శనివారం నైట్ క్యాంప్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యకర వాతావరణం అందించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కుండల తయారీ, బెలూన్ షూటింగ్, జార్బింగ్, రోటేట్‌బౌన్సీ, పిక్ ది కోన్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థినీ విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అక్షర పాఠశాల సీఈఓ మదనమోహన్‌రావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపాలన్నారు. తెల్లవారుజామున జుంబా, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

గీజర్ పేలి కార్మికుడికి గాయాలు

జీడిమెట్ల: గాంధీనగర్‌లోని ఓ పరిశ్రమలో గీజర్ పేలడంతో వేడి నీళ్లు మీద పడి ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ పవన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి ఒడిశా రాష్ట్రానికి చెందిన బసంత్‌కుమార్ మహారాణా గాంధీనగర్‌లో ఉంటూ ఫ్లోరోథర్మల్ పరిశ్రమలో కార్మికునిగా పని చేస్తున్నాడు. శుక్రవారం అతను ఫ్యాక్టరీలో కాళ్లు, చేతులు కడుక్కునేందుకు పరిశ్రమ ఆవరణలోని బాత్‌రూంలోకి వెళ్లాడు. అప్పటికే బాత్‌రూంలో ఆన్ చేసి ఉన్న గీజర్ ఒక్కసారిగా పేలడంతో బసంత్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తోటి సిబ్బంది అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు. పరిశ్రమ యాజమాన్యం బాధితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

సమన్వయలోపంతోనే ప్రజలకు కష్టాలు

ఆల్విన్‌కాలనీ: అధికారులు, నాయకుల మధ్య సమన్వయం లేనందునే సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రజలు కష్టాలు పడుతున్నారన్నారు. ఎన్నిసార్లు జీహెచ్ఎంసీ కార్యాలయం చుట్టూ తిరిగినా, ఎమ్మెల్యేను కలిసినా ఒక్క పని జరగటం లేదని ప్రజలు వాపోతున్నారన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తీర్చేవారు లేరన్నారు. ప్రజల కష్టాలు పరిష్కరించేందుకు బీజేపీ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రావు, నర్సింగ్ రావు, నరేందర్‌రెడ్డి, కల్పనా ఏకాంత్ గౌడ్, గోపాల్‌రావు, శ్రీహరియాదవ్, కుమార్ యాదవ్, నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, నామాల శ్రీనివాస్, లలిత రెడ్డి, మమత, రేణుక, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు

కూకట్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సురేష్ అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు శనివారం 'మొక్కలను రక్షించు.. వేసవి వేడిని తగ్గించు' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు నాడు మొక్క నాటి కాపాడాలన్నారు. తరంగిణి పీఆర్ఓ యోగేష్ ప్రభు మాట్లాడుతూ అందరు స్వదేశీ వస్తువులు వాడాలని దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాధవరం కాంతారావు, డాక్టర్ శ్రీనాథ్, వికాస్ తరంగిని అధ్యక్షుడు శ్రవణ్, హరిబాబు, నాగేశ్వర్‌రావు, కృష్ణంరాజు, విఠల్, వైకుంఠం, కళావతి, శశికుమార్, కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా మల్లేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అడ్వకేట్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులుగా రాష్ట్ర బీసీ నాయకులు మల్లేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయనను తెలంగాణ బీసీ వికాస్ సమితి అధ్యక్షుడు బాశెట్టి నర్సింగ్‌రావు, బీసీ సంఘాల నేతలు కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు గున్నాల వినోద్, పద్మయ్య, అడ్వకేట్ కేశవరావు, వడ్ల వెంకటేష్, గోవర్ధన్, పండిత్రావ్, మేడ్చల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు తేళ్ల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

